క్లుప్తంగా

ఉచిత మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరంలో ఉచితంగా మందులు అందజేస్తున్న భాను ప్రసాద్

తాళ్లపూడి: ప్రక్కిలంకలోని ప్రసన్న నర్సింగ్ హోమ్ నెలకొలిప్ప 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో డాక్టర్ జమ్ముల మృదుల, ఇమ్మణ్ణి గిరిధర్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రవిరామ్‌కిరణ్ తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 750 మంది సేవలు పొందారు. ఈసీజీ, 2డిఎకో పరీక్షలు చేసారు. డాక్టర్ భాను ప్రసాద్ మాట్లాడుతూ మార్చి 15వ తేదీ వరకు వయసు పై బడిన వారికి ఉచితంగా వైద్య సేవలు అందజేస్తామన్నారు.

స్వామివారికి లక్ష తులసి పూజ



ప్రత్యేక అలంకరణలో దాసాంజనేయ స్వామివారు

నిడదవోలు : పట్టణంలో వేంచేసియున్న శ్రీ దాసాంజనేయ స్వామివారి ఆలయంలో ఆదివారం లక్ష తులసి పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రాజోలు బాలసుబ్రహ్మణ్య శివాచార్యుల ఆధ్వర్యంలో 11 మంది వేద పండితులు మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, గంధ సిందూరం, తమలపాకులతో పూజలు చేశారు. పట్టణ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

హృద్యంగా కోలాటం



ఆలయంలో కోలాటం వేస్తున్న మహిళలు, పిల్లలు

ఉండ్రాజవరం : మండలంలోని వేలివెన్ను గ్రామంలో వేంచేసియున్న శ్రీసూర్యానారాయణ స్వామి ఆలయం వద్ద ఆదివారం ఉదయం మహిళలు, పిల్లలు హృద్యంగా కోలాటం నిర్వహించారు. అనంతరం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య పాల్గొన్నారు. వేలివెన్ను, కాల్దారీ, దమ్మెన్ను తదితర గ్రామాల నుంచి ప్రజలు వచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.

ఘనంగా బల్లల పండగ



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న రజకులు

కొవ్వూరు: పట్టణంలో గోష్పాదక్షేత్రంలో రజకులు బల్లల పండగను ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. తమ కుల వృతికి మూలమైన బల్లలకు పసుపు రాసి పూజలు చేశారు. గోదావరి నదికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గౌతమీ రజక జనసేవా సంఘం అధ్యక్షుడు కోటిచుక్కల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు వేల్పూరి శ్రీనివాసరావు, కార్యదర్శి పొన్నాడ శ్రీనివాస్ పాల్గొన్నారు. కుటుంబ సమేతంగా పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో సౌరహోమం



సౌరయాగం నిర్వహిస్తున్న రుత్వికులు

కొవ్వూరు: రథసప్తమి సందర్భంగా పట్టణంలో సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పాదేశ్వరస్వామి సన్నిధిలోని సూర్యనారాయణమూర్తి ఉపాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణానికి చెందిన ముదిండి వెంకట రామరాజు, విజయలక్ష్మి దంపతులు సూర్యనారాయణమూర్తికి వెండి కిరీటం సమర్పించారు. ఆలయంలో ఆదివారం సూర్య నమస్కారాలు, సౌర హోమం నిర్వహించారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నిడదవోలు : మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు.

అక్క చెల్లెమ్మలకు పక్కాగా ఆసరా



డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా నమునా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయిడు, నాయకులు (ఫైల్)

- మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకం అమలుకు కసరత్తు
- నియోజకవర్గంలో 48,149 మంది డ్వాక్రా సభ్యులకు లబ్ధి
- ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్న సీఎం జగన్ నిర్ణయంపై సర్వత్రా హర్షం

నిడదవోలు రూరల్: అక్కచెల్లెమ్మలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఆర్థికంగా ఆసరా కల్పిస్తూ కుటుంబాల ఉన్నతికి తోడ్పాటు అందిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాలతో ఒకటైన వైఎస్సార్ ఆసరా పథకం సమర్థంగా అమలు చేస్తున్నారు. ఇప్పటికే రెండు విడతల్లో అక్క చెల్లెమ్మలకు ఆసరా సొమ్మును అందించారు. మూడోవిడత అమలుకు అధికారులు కసరత్తు

వైఎస్సార్ ఆసరా పథకం వివరాలు

మండలం	డ్వాక్రా సంఘాలు	డ్వాక్రా మహిళలు	మొత్తం లబ్ధి (రూ.కోట్లలో)
నిడదవోలు	545	5,543	17.08
నిడదవోలు మండలం	1,438	14,331	48.09
పెరవలి	1,531	15,285	74.87
ఉండ్రాజవరం	1,306	12,990	45.53
మొత్తం	4,820	48,149	185.57

చేస్తున్నారు. అర్హుల జాబితాను సచివాలయాల్లో అందుబాటులో ఉంచారు. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమాన్ని కొనసాగించడంతో ఎంతో ఆనందంగా ఉందని డ్వాక్రా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా..

తన పాదయాత్రలో మహిళల కష్టాలు, ఆర్థిక ఇబ్బందులను వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ కళ్లారా చూశారు. తాము అధికారంలోకి వస్తే 2019 ఏప్రిల్ 11వ తేదీ వరకు సక్రమంగా రుణాలు చెల్లించిన స్వయం సహాయక సంఘాల సభ్యులకు నాలుగు విడతల్లో తిరిగి ఆ మొత్తాన్ని జమ చేస్తామని చెప్పారు. కోవిడ్ కష్టకాలం, ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన హామీ కోసం రెండు విడతలుగా ఆసరా సొమ్ము అందించారు. మూడో విడత ఫిబ్రవరి నెలలో అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు.

నియోజకవర్గంలో 4,820 గ్రూపుల ఎంపిక

నిడదవోలు నియోజకవర్గంలో 4,820 పొదుపు సంఘాలు ఉండగా 48,149 మంది మహిళలను ఎంపిక చేసి వారికి రూ.185.57 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. మూడో విడతగా నిడదవోలు పట్టణంలోని 546 డ్వాక్రా సంఘాలకు రూ.4.27 కోట్లు, నిడదవోలు మండలంలో 1,438 డ్వాక్రా సంఘాలకు 12.02 కోట్లు, పెరవలి మండలంలో 1,531 డ్వాక్రా సంఘాలకు రూ.18.64 కోట్లు, ఉండ్రాజవరం మండలంలో 1,306 డ్వాక్రా సంఘాలకు 11.38 కోట్లు అందనున్నాయి.

మాట నిలబెట్టుకున్నారు



రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారిత వైపు అడుగులు వేస్తోంది. నామినేటెడ్ పోస్టులు, ప్రభుత్వ పథకాల్లో మహిళలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు డ్వాక్రా రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం జగనన్న చెప్పిన మాటకు కట్టుబడి విడతల వారీగా రుణమాఫీ చేస్తుండటం సంతోషంగా ఉంది.

– కాలాబత్తుల సుజాత, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు, పందలపర్రు

మహిళల పాలిట వరం



వైఎస్సార్ ఆసరా పథకం మహిళల పాలిట వరం. 2019లో నిర్మలా గ్రూపు ద్వారా రూ.5 లక్షల డ్వాక్రా రుణం తీసుకున్నాం. నాలుగు విడతల్లో మేము తీసుకున్న రూ.5లక్షలతో పాటు వడ్డీగా రూ.699 అదనంగా చెల్లిస్తున్నారు. కరోనా కష్టకాలంలోనూ రెండు విడతల్లో ఆసరా సాయం అందింది.

– దిద్దే వరలక్ష్మి, డ్వాక్రా సభ్యురాలు, సమిశ్రగూడెం

అన్ని పథకాల్లో పెద్ద పీట



రాష్ట్రంలో అమలవుతున్న అన్ని పథకాల్లో మహిళలకు సీఎం వైఎస్ జగన్ పెద్దపీట వేస్తున్నారు. ఆసరా మూడో విడతకు సంబంధించి నియోజకవర్గంలో పొదుపు సభ్యుల బయోమెట్రిక్ పూర్తిచేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు నామినేటెడ్ పదవుల్లో 50 శాతం అమలుచేసి సముచిత స్థానం కల్పిస్తున్నాం. డ్వాక్రా మహిళల ఖాతాల్లో నేరుగా రుణమాఫీ సొమ్ము వేయడంతో ఆ కుటుంబాలకు ఆసరాగా ఉంటుంది.

–జి.శ్రీనివాస్‌నాయుడు, ఎమ్మెల్యే, నిడదవోలు

ఒకటిన అభయాంజనేయుని విగ్రహ ప్రతిష్ఠ

కొవ్వూరు: ఫిబ్రవరి ఒకటో తేదీన కుమారదేవం గ్రామంలో అనంత భోగేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో యండపల్లి సుబ్బారావు, రామలక్ష్మి చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఉదయం 9.23 గంటలకు నిర్వహించే ఈ ప్రతిష్ఠ అనంతరం అన్నసమారాధన నిర్వహించ నున్నట్లు తెలిపారు. గ్రామంలో యాగశాల ఏర్పాటు చేశారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పటి అందజేస్తున్న దాతలు

నిడదవోలు : పట్టణంలోని వడ్డిల వీధిలో జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమాల సత్యవేణి జ్ఞాపకార్థం ఆలయ ఈవో సోమాల శివ, సోమాల చైతన్య ఆర్థిక సహకారంతో ఆదివారం 50 మంది దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ర్యాలి సత్యనారాయణ (శివ) మాట్లాడుతూ దివ్యాంగులకు సేవ చేయాలనే సంకల్పంతో వారికి చేయూతనందిస్తున్న దాతల సహకారం అభినందనీయమన్నారు. కృప, వర్మ, యసు, సునీత, ఆదిలక్ష్మి, షబినా, మోహన్, బండి ఉమ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



తహసీల్దార్ శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న నాయకులు

చాగల్లు: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తే తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ మట్టా వీరాస్వామి అన్నారు. చాగల్లు తహసీల్దార్‌గా పనిచేసిన ఎం.శ్రీనివాసరావు డిప్యూటి కలెక్టర్‌గా పదోన్నతిపై బదిలీ అవుతున్న సందర్భంగా నెలటూరులో సీతారామస్వామి కల్యాణ మంటపంలో ఆదివారం అభినందన సభను నిర్వహించారు. శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ కొఠారు అశోక్‌బాబా పాల్గొన్నారు. శ్రీనివాసరావు రెవిన్యూ శాఖలో ఉద్యోగిగా 42 ఏళ్లుగా అందిస్తున్న సేవలను కొనియాడారు. ఇన్‌చార్జి తహసీల్దార్ కె.నిరంజన్, ఎంపీడీవో బి.రామ్‌ప్రసాద్, డిప్యూటి తహసీల్దార్ ఆనంద్, వైఎస్సార్ సీపీ నాయకులు లకంసాని సూర్యప్రకాశరావు, లకంసాని శ్రీనివాసరావు, బండి అశోక్‌బాబు పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యుడి బహిరంగ క్షమాపణ

నిడదవోలు రూరల్: ఎంపీటీసీ సభ్యుడిగా గెలుపొంది 16 నెలలు అయినా నేటికీ గామాభివృద్ధికి ఏమి చేయలేకపోయానని ఆవేదన వ్యక్తం చేస్తూ నిడదవోలు మండలం పెండ్యాల ఎంపీటీసీ సభ్యుడు వాకా శ్రీను (ఇంద్రగౌడ్) ఆదివారం ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పారు. స్థానిక గౌడ రామాలయం మాట్లాడుతూ రాజకీయ కక్షతో తనకు నిధులు మంజూరు చేయకుండా అధికార పార్టీ నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

నవరత్నాలతో ప్రతి ఇంటా సంక్షేమం

- హోం మంత్రి వనిత
- దారవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



దారవరంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి వనిత

చాగల్లు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని దారవరంలో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఇప్పటి వరకూ మూడున్నర ఏళ్ల కాలంలో ఏఏ పథకాలు అందాయో ప్రతి కుటుంబాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన అజెండా అని అన్నారు. మనసున్న ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రతి నెలా పింఛన్లను క్రమం తప్పకుండా ఒకటో తేదీన ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి అందజేస్తున్నారని పేర్కొన్నారు. రేషన్ బియ్యం కార్డుదారుల ఇంటి వద్దకే వస్తున్నాయని తెలియజేశారు. పేదింటి విద్యార్థులు చదువుకోవడానికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. ఆరోగ్యశ్రీకి పూర్వ వైభవం తీసుకొచ్చామని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు అనేక సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. అన్ని వర్గాలకు మేలు చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ మట్టా వీరాస్వామి, మండల పార్టీ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, దారవరం సర్పంచ్ మద్దుకూరి రవిప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు ఉభా భాగ్యవతి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు వుండవల్లి వెంకటేశ్వరరావు, మద్దుకూరి మోహన్‌చౌదరి, కట్టా స్వామి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

సత్యవేణు శర్మకు నంది పురస్కారం



పురస్కారాన్ని అందిస్తున్న దామోదర్

నిడదవోలు : పట్టణానికి చెందిన జ్యోతిష్యుడు మద్దిరాల సత్యవేణు శర్మను నంది పురస్కారంతో సత్కరించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో భారత్ ఆర్ట్స్ అకాడమీ అండ్ ఏబీసీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సంక్రాంతి పురస్కారాల కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ చేతుల మీదుగా సత్యవేణు శర్మకు పురస్కారం అందజేశారు. ఆయన గతంలో భారత జ్యోతిష్య రత్న, భారత సేవా రత్న, భారత ప్రతిభారత్న పురస్కారాలను సొంతం చేసుకున్నారు.

పండ్లు పంపిణీ

గోపాలపురం: రాష్ట్ర క్రీడల విభాగం డైరెక్టర్ కప్పల వరలక్ష్మి ఆదివారం గోపాలపురంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. రెండు సంవత్సరాలుగా గోపాలపురం సమీపంలో ఉన్న బీసీ కాలనీ, పెద్దగూడెంలో ఉన్న వృద్ధులకు, వికలాంగులకు అనాథలకు పండ్లు, భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. ప్రతి ఆదివారం సుమారు 50మందికి పండ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర క్రీడల విభాగం డైరెక్టర్‌గా ఎంపిక జరిగిన నాటి నుంచి సుమారు 5లక్షల వ్యయంతో యువలకు క్రీడా సామగ్రిని అందజేసినట్లు చెప్పారు.

మాజీ సర్పంచ్ గంగారత్నం మృతి



గోపాలపురం: గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బంటు గంగారత్నం (63)ఆదివారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమె 2013 నుంచి 2018వరకూ సర్పంచ్‌గా పనిచేశారు. ఈమె భర్త ఓఎన్‌జీసీ డీజీఎంగా పనిచేశారు. వీరికి నలుగురు పిల్లలు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.

మాజీ మంత్రి వసంత్‌కుమార్ మృతికి సంతాపం

కొవ్వూరు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి వట్టి వసంత్‌కుమార్ మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని సంతా పాన్ని తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కరిబండి గన్నిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, తాళ్లపూడి మాజీ ఎంపీపీ కొమ్మిరెడ్డి పరశురామారావు, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ రఫీయుల్లా బేగ్ సంతాపం వ్యక్తం చేశారు.

400 మందికి వైద్యపరీక్షలు

గోపాలపురం: మండలంలోని చెరుకుమిల్లిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 400 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు గ్రామ సర్పంచ్ ముళ్లపూడి వరలక్ష్మి చెప్పారు. సర్పంచ్ భర్త విష్ణుమూర్తి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో రాజమహేంద్రవరం హెలియోస్ వైద్యులు పరీక్షలు చేశారు. రోగులకు ఉచిత భోజనాలతో పాటు మందులు పంపిణీ చేశారు. నెలలో రెండు రోజులు వివిధ గ్రామాలలో శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు డాక్టర్ బి.శివశంకర్ తెలిపారు.

మత్స్యకారులకు ఎంపీ అభినందనలు



మత్స్యకారులకు ఫోన్ పే ద్వారా సొమ్ము చెల్లిస్తున్న ఎంపీ భరత్‌రామ్

కొవ్వూరు: మత్స్యకారులు సాంకేతికత వైపు అడుగులు వేయడం, చేపల అమ్మకాల్లో ఫోన్ పే, గూగుల్ పే వంటివి వినియోగించడం అభినందనీయం అని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు విచ్చేసిన ఆయన టోల్‌గేట్ జంక్షన్ వద్ద రోడ్డు పక్కన చేపలు విక్రయిస్తున్న మత్స్యకారుల వద్ద కొద్దిసేపు ఆగి వారితో ముచ్చటించారు. వ్యాపారం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. మత్స్యకార వ్యాపారులంతా ఫోన్ పే, గూగుల్ పే వినియోగించడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వారి వద్ద చేపలు కొనుగోలు చేసి ఫోన్ పే ద్వారా వారికి సొమ్ము చెల్లించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పరిమి హరిచరణ్ ఆయన వెంట ఉన్నారు.

మానవత సంస్థ ఆర్థిక సాయం



బాపిరాజుకు రూ.5 వేలు అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

దేవరపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న తీగెల లోకేష్‌కు రూ.5,000, పల్లంట్లకు చెందిన విద్యార్థిని అడుసుమిల్లి రమ్యశ్రీకి చదువు నిమిత్తం రూ.5,000 చొప్పున దేవరపల్లి మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సాయం అందజేసింది. ఆదివారం స్థానిక ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణ మంటపంలో జరిగిన సమావేశంలో పై ఇద్దరికి సాయం అందజేశారు. మండల మానవత సంస్థ గౌరవాధ్యక్షుడు కేశిరాజు సీతారామయ్య, మండల చైర్మన్ బలుసు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు బళ్ల సూర్యచక్రం, కేశిరాజు రాజ్‌కుమార్, తీగెల రాజా, మదవరపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంపీ భరత్‌రామ్ కృషి అభినందనీయం



బైబిల్ మిషన్ సభలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): స్థానిక క్వారీ మార్కెట్ సమీపంలోని శానిటోరియమ్ స్వస్థతశాలలో జరిగిన బైబిల్ మిషన్ 85వ మహాసభలలో ఆదివారం ఎంపీ భరత్ రామ్‌ను క్రైస్తవులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాస్టర్ ఎస్.వి జయరాజు మాట్లాడుతూ క్రైస్తవుల శ్మశాన వాటిక కోసం ఆరెకరాలను ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయడంలో ఎంపీ భరత్ చేసిన కృషి అభినందనీయమన్నారు. గతంలో ఈ సమస్య ఎవ్వరూ పెద్దగా పట్టించుకోలేదని, ఎంపీ భరత్‌రామ్‌కు విన్నవించగా వెంటనే పట్టుదలతో సాధించారన్నారు. ఎంపీ భరత్ మాట్లాడుతూ క్రైస్తవులకు శ్మశాన వాటిక లేకపోవడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఇందుకోసం కలెక్టరేట్ సమీపంలో ఆరెకరాలను ప్రభుత్వ ధర ప్రకారం రూ.30 కోట్లకు కొనుగోలు చేసినట్టు చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్‌కు అందరూ చేదోడుగా నిలవాలన్నారు. పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, కాంతారామ్ పాటిల్, పాలా సాయి, మార్గాని బుజ్జి, సుందర్ సింగ్ పాల్గొన్నారు.

నేడు 'హరితా యువత' కార్యక్రమం

రాజమహేంద్రవరంలో ఎంపీ మార్గాని భరత్ రామ్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే హరితా యువత కార్యక్రమంలో నగర వాసులందరూ పాల్గొనాలని ప్రముఖ సినీ కథానాయిక ఈషా చావ్లా పిలుపునిచ్చారు. నందం గనిరాజు జంక్షన్ వద్ద సోమవారం ఉదయం 9.30 గంటలకు పెద్ద ఎత్తున యువత, విద్యార్థులతో గ్రీన్ చాలెంజ్ నినాదంతో ఎంపీ భరత్ సారథ్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో హీరోయిన్ ఈషా చావ్లాతో పాటు అనేక మంది ప్రముఖులు పాల్గొంటున్నారు. ఆమె మాట్లాడుతూ కదలిరండి యువతా, నేనూ, మీరూ మనమందరం కలిసి రాజమహేంద్రవరం నగరంలో మొక్కలు నాటుదాం, పచ్చని సుందర నగరంగా తీర్చి దిద్దుదామని పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో తిరువీధి ఉత్సవం

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): కోరుకొండ రోడ్డులోని సింహాచలనగర్ వరహాలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో మదుభయ వేదాంతాచార్య పీఠం ట్రస్టు, శ్రీరంగం ఆధ్వర్యాన ఫిబ్రవరి 2వ తేదీ వరకూ 21వ వార్షిక చందన యాత్ర మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ధ్వజారోహణ జరిగింది. సాయంత్రం తిరువీధి (గరుడ సేవ) ఉత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్య సింహాచలం, కాలెపు నాగేశ్వరరావు ఊరేగింపు ప్రారంభించారు. అవసరాల కిరణస్వామి, ముప్పిరాల అనంతాచార్యులు, పరాశర రఘునాథ భట్టర్ స్వామి ఆధ్వర్యంలో ఆలయం నుంచి కంబాల చెరువు, దేవీచౌక్, కోటగుమ్మం, మెయిన్ రోడ్డు, సాయికృష్ణ, ఊర్వశి సెంటర్, జాంపేట మీదుగా ఊరేగింపు సాగి ఆలయానికి చేరుకుంది. దారి పొడవునా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం ఉదయం హోమాలు, సాయంత్రం తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు.



స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు